# భారతదేశ ఐక్యతకు పునాది రాజ్యాంగం

బ్రిటిష్ కాలం నాటి భారత ప్రభుత్వ చట్టం 1935 రద్దయి భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఏర్పాటు చేయబడిన రోజు 1950 జనవరి 26. దేశం యావత్తు గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం. ఈ రాజ్యాంగం ప్రారంభంలో 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్ళు, 22 రెండు భాగాలుగా ఉండేది. ప్రస్తుతం 465 ఆర్టికల్స్, 12 షెడ్యూల్ 25 భాగాలుగా ఉంది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్, 1935లో 52 వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూల్ 1992లో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా 11, 12వ షెడ్యూల్ చేర్చబడ్డాయి. జనవరి 2018 నాటికి భారత రాజ్యాంగానికి 123 ప్రతిపాదిస్తే 101 సవరణ చట్టాలు చేయబడ్డాయి. రాజ్యాంగంలో 4వ భాగంలో ప్రజలకు సమానత్వం కలిగించడానికి రాజ్యాంగం లో ఆదేశిక సూత్రాలను పొందు పరిచారు. 3వ భాగంలో ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.



ఎన్.వెంకటేశ్వర్లు
యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

14వ అధికరణం ప్రకారం దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు రక్షణ కల్పించాలి. అలాగే ప్రజలందరికీ ఆర్థిక సామాజిక రాజకీయ న్యాయం అందించే లక్ష్యాలతో భారత రాజ్యాంగ రూపకల్పన చేయబడింది.

రాజ్యాంగంలోని 356 ఆర్టికల్‌ని ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం మాట వినని రాష్ట్ర ప్రభుత్వాలను అన్యాయంగా రద్దు చేసినా, ప్రాథమిక హక్కులకు ఆయా సందర్భాల్లో భంగం కలిగించినా, ఆదేశ సూత్రాలు అమలు సరిగా నిర్వహించలేక పోయినా, కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగించినా, చట్టం అందరికీ సమానంగా వర్తించక పోయేనా, ఇలాంటి ఇబ్బందులు ఎదురైనా, రాజ్యాంగ పరిధిలోనే పోరాటం చేస్తూ, రాజ్యాంగాన్ని సంరక్షించు కుంటూ రాజ్యాంగ మౌలిక సూత్రాలను దెబ్బతిన కుండా దేశంలోని ప్రజలు కులానికి, మతానికి ప్రాంతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని రక్షించుకునే సందర్భాలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిఇచ్చి దేశంలో భాగస్వామ్యం చేస్తూ ఐక్యతను కాపాడు కోవడానికి ప్రధాన కారణం రాజ్యాంగంలో ఉన్న సూత్రాలు. తల్లి వడిలో హాయిగా నిద్ర పోతారు బిడ్డలు. కారణం తన తల్లిపై అపారమైన గౌరవం. తనను రక్షిస్తుందని విశ్వాసం. కానీ ఆతల్లే బిడ్డను నిద్రలో చిదిమేస్తే,కంచే చేను మేస్తే.... ఇప్పటి పరిస్థితులు అలాగే అనిపిస్తున్నాయి. రాజ్యాంగ మౌలిక లక్షణాలైనలౌకిక, ప్రజాస్వామ్య, ఆర్థిక, సామాజిక న్యాయం ప్రస్తుతం ప్రమాదంలో పడ్డాయి. సంపద పంపిణీ, సమాన న్యాయం, ఎండమావి గా మారాయి. స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ రాజ్యాంగాన్ని, ఈ దేశ సమైక్యతను , ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ, విధ్వంసాన్ని సృష్టిస్తూ సిఏఏ, ఎన్ఆర్‌సి, మనోభావాల పేరుతో, అనవసరమైన టువంటి వివాదాలకు తెరలేపుతున్నారు నేటి పాలకులు. ఈ నేపథ్యంలో మన గణతంత్ర దినోత్సవం, మన గణతంత్ర రాజ్యం మన సార్వభౌ మాధికారం, మన రాజ్యాంగ లక్ష్యాలు ప్రమాదపు అంచున ఉన్నాయి. వీటన్నిటినీ ఎదుర్కోవటానికి, భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించుకునే దానికోసం మనందరం కృషి చేయాలి.

**సంపద పంపిణీ :**

70.74 శాతం సొత్తు 10 శాతం జనాభా చేతుల్లో ఉంది. 60 శాతం మంది వద్ద 4.8 శాతం సంపద మాత్రమే ఉంది. ధనికుల సంపద గత ఏడాది 20.9 లక్షల కోట్లు పెరిగింది. ఇది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తోసమానం. ప్రస్తుత భారతబిలీనియర్స్ సంఖ్య 198 కి చేరింది. వీరి ఆదాయం మొత్తం 400 బిలియన్ డాలర్లు అంటే 28 లక్షల కోట్లకు చేరిందని ఆక్స్ ఫామ్ నివేదిక తెలిపింది .కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలమొత్తం రెవిన్యూఖర్చు 2,08,166 కోట్లు. భారతదేశం ముఖేష్ అంబానీ సంపద 2.80 కోట్లు. దేశంలో అత్యధిక రాంకింగ్ కలిగిన అధికారి రోజువారి వేతనం 8,600. గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పనిచేస్తున్న పేదల యొక్క రోజువారి వేతనం 187 రూపాయలు. ముఖేష్ అంబానీ రోజు వారి సంపాదన 300 కోట్లు. రాజ్యాంగ మౌలిక లక్షణాలలో ఉన్న సంపద పంపిణీ ఎంత వ్యత్యాసంగా ఉందో తెలుస్తుంది. అంటే ఇప్పటి వరకు ఈ భారతదేశాన్ని పరిపాలించిన పాలకులు పేదల అభ్యున్నతి కంటే కార్పొరేట్ల అభివృద్ధి కోసం కష్టపడ్డారు, పరిపాలించారు, చట్టాలను సవరణ చేశారు అని అనిపిస్తుంది.

మౌలిక సూత్రం ప్రమాదంలో పడింది. ఈ దేశంలో ఆర్థిక మాంద్య పరిస్థితులు ఏర్పడ్డాయని భావిస్తున్నా, కొన్ని లక్షల ఉద్యోగాలు కోల్పోతున్నా, ప్రభుత్వ ప్రైవేటు రంగ కంపెనీలు మూత పడుతున్నా, కార్పొరేటు దిగ్గజం ముఖేష్ అంబానీ ఆస్తుల విలువ మాత్రం పెరుగుతూనే ఉంది. దీన్నిబట్టి నేటి పాలకులు ఎవరికోసం కష్టపడుతున్నారు అర్థమవుతూనే ఉంది.

**ఫెడరల్ వ్యవస్థ :**

ఉత్పత్తి విధానం అభివృద్ధి చెందే క్రమంలో అనేక తెగలు కలిసి జాతి గా రూపాంతరం చెందాయి. యూరప్ ఖండంలో ఒక్కొక్క జాతి ఒక్కొక్కదేశంగా ఏర్పడ్డాయి. కానీ భారతదేశంలో స్వాతంత్రోద్యమ కాలంలో ఒకవైపు విశాలాంధ్రలో ప్రజారాజ్యం కావాలని, ఐక్య కేరళ, కన్నడ, మహారాష్ట్ర , గుజరాత్ రాష్ట్రాలలో సంయుక్త రాష్ట్రాల నినాదాలు జాతీయోద్యమంలో భాగంగా జరిగాయి. ఏకకాలంలో మనమంతా భారతీయులం అనే జాతీయ చైతన్యం, రెండో వైపున జాతుల చైతన్యం కలిసి సంయుక్తంగా పోరాటం చేశారు. ఈ పోరాటాలు ఐక్య రూపమే ఫెడరలిజం. సాధారణ పరిస్థితుల్లో రాష్ట్రాలకు అధికారాలు ఇస్తూ, అత్యవసర సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఇస్తూ రాజ్యాంగం రూపొందించబడింది. ఒకే జాతి ఒకే సంస్కృతి, ఒకే భాష పేరుతో కొన్ని జాతుల పై కొన్ని మతాలపై దాడి చేస్తున్నారు. కాశ్మీర్ జాతి భారతదేశంలో విలీనం సర్దుబాటు రూపమే 370 ఆర్టికల్. దీన్ని రద్దు చేశారు. జిఎస్‌టి తీసుకొచ్చారు, రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేసే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేశారు. ఇలా ఎన్నో రాజ్యాంగానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇది దీర్ఘకాలం కొనసాగితే భారతదేశం లో కూడా ఒక్కొక్క జాతి ఒక్కొక్క దేశంగా కావాలనే డిమాండ్ ముందుకు వచ్చే అత్యంత ప్రమాదకరమైన భావన ప్రజలలో ఏర్పడుతుంది. మన జాతి సమైక్యతకు ప్రమాదం ఏర్పడుతుంది. ఈ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఐక్య పోరాటాలుద్వారా రాజ్యాంగాన్ని, మనం అందరం భారతీయులం అనే సూత్రాన్ని ముందుకు తీసుకెళ్లాలి.

**లౌకిక విధానం :**

ప్రజలు వ్యక్తిగతంగా మతపరమైన విషయాలు పాటించే స్వేచ్ఛ, రాజ్యం మత పరమైన విషయాలకు దూరంగా ఉండటం అనేది లౌకిక విధానం. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో" భారతదేశం లౌకిక రాజ్యం" ప్రకటించ బడినది. లౌకిక రాజ్యం అధికారంలో ఏ మత సూత్రాలను పట్టించుకోదు. లౌకిక రాజ్యం మత భావాలను ప్రబోధించదు. ప్రచారం చేయదు. ఏ మతాన్ని అధికార మతంగా గుర్తించదు. ప్రజల్లో లౌకికవాద అభివృద్ధికి, హేతుబద్ధమైన ఆలోచన వ్యాప్తి చేయడానికి ప్రయత్నం చేస్తుంది. మూఢనమ్మకాల పట్ల ప్రజల్లో వ్యతిరేకత కల్పిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతికి తోడ్పడుతుంది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే దానికోసం చర్యలు తీసుకుంటుంది. ప్రజల యొక్క శక్తి మీద ఆధారపడి ఉత్పత్తులు జరుగుతాయని ప్రజల్లో విశ్వాసం కలిగించే ప్రయత్నం చేస్తుంది. ఇవన్నీ లౌకిక రాజ్యం యొక్క లక్షణాలు. కానీ దీనికి భిన్నంగా లౌకిక రాజ్యం అనే భావనను రాజ్యాంగంలో పొందుపరిచి, లౌకిక విధానాన్ని పాలకవర్గాలు అమలు చేసే విషయంలో కొన్ని సందర్భాల్లో మెతకవైఖరి, కొన్ని సందర్భాల్లో రాజీ ధోరణి, కొన్ని సందర్భాలలో ఒక మతం వైపు ఒరిగిపోవడం ఉదా హరణలు కోకొల్లలు. ఇది సందర్భం కాకపోయినా భారతదేశంలో బ్రిటిష్ వారి పరిపాలనాలో 1857ప్రథమ స్వాతంత్ర సంగ్రామ ంలో భారతీయుల యొక్క ఐక్యత చూసిన ప్రభుత్వం, తన పాలన సాగాలంటే మతాల మధ్య ఘర్షణసృష్టించే ప్రయత్నం చేసారు. దానికి కొనసాగింపుగానే ఈ రోజుకి భారతదేశంలో ఎన్ని రకాల మత ఘర్షణలు జరిగినా, ఐక్యతను చాటుకుంటూ ముందుకి వెళ్తున్నాం. కానీ ఈ రోజున రకరకాల సర్వే లు పేరుతో ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాజ్యాంగ మౌలిక సూత్రం విధానానికి తూట్లు పొడుస్తున్నారు. మత రాజ్యాలు గా నడుపుతున్న వివిధ దేశాల అనుభవాలను గమనిస్తే అరాచకం, మిలటరీ పాలన, నిత్యం అలజడులు జరుగుతున్న పరిస్థితి గమనిస్తున్నాం. ఐనా భారతదేశలౌకిక విధానానికి తిలోదకాలు ఇవ్వడానికి ప్రయత్నం చేయడం అంటే ఎవరికి ఉపయోగమో మనం గమనించాలి.

**రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపతి :**

భారత రాజ్యాంగంలో స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్, ఆర్బిఐ, సుప్రీం కోర్ట్, యూపీఎస్సీ , యుజిసి, ప్రణాళికా సంఘం లాంటి సంస్థలు రూపొందించారు. నేడు పరిపాలనకు చేరువ చేస్తూ, ప్రజలకు సేవ చేస్తూ, అందరికీ అందుబాటులో ఉంటూ కొన్ని చిన్న చిన్న లోపాలు ఉన్నా ప్రజల మధ్య పని చేస్తున్నాయిఈ సంస్థ లు. ఈ సంస్థలునేడు తన స్వయం ప్రతిపత్తి కోల్పోయి కేంద్రం చెప్పినట్లుగా వినే సంస్థలుగా మారబోతున్నా యా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఏమైనా ఈ రాజ్యాంగ సంస్థలను కాపాడుకునే దానికోసం కృషి చేయాలి

**గణతంత్రంని రక్షించుకుందాం**

ఎంతో విశిష్టత కలిగిన భారతదేశ రాజ్యాంగాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత ప్రజలందరిది. ఐక్యతతో విచిన్న కారులు వేసే పాచికలలో పావులుగా మారకుండా, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం. మన భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగంలో ఉన్న మౌలిక లక్షణాలు కాపాడుకుందాం.